క్లుప్తంగా

దేశ భవిష్యత్ యువతదే



మాట్లాడుతున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అన్నారు. మండలంలోని సోలక్‌పల్లి గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో పడుతున్న సేవా కార్యక్రమాలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. యువత పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సమావేశంలో యువజన సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య శిబిరంలో ప్రభాకర్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ సూచించారు. మండలంలోని నల్తూర్ గ్రామంలో ఓ పరిశ్రమకు చెందిన ప్రతినిధులు మంగళవారం ఉచిత మొబైల్ వైద్య శిబిరాన్ని నిర్వహించగా, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, వైద్యులు పాల్గొన్నారు.

రైతు బీమా చెక్కులు అందజేత



చెక్కులను అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో ఇటీవల మృతి చెందిన రైతులు అరవింద్‌రెడ్డి, భిక్షపతి కుటుంబాలకు ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌లు మంగళవారం రైతుబీమా చెక్కులను అందజేశారు. రైతుబీమా పథకం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కులను మృతుల కుటుంబాలకు అందించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాగల్‌గిద్ద ఎంపీడీఓ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన ఎంపీడీఓ రాజశేఖర్

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద నూతన ఎంపీడీఓగా బాధ్యలు చేపట్టిన రాజశేఖర్ మంగళవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో నాయకులు రమేశ్‌చౌహన్, సత్యపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్

జిన్నారం(పటాన్‌చెరు): ఓటరు నమోదు, నకిలీ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిన్నారం తహసీల్దార్ దశరథ్ సింగ్ రాథోడ్ తెలిపారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో ఓటరు నమోదు, నకిలీ ఓట్ల తొలగింపు తదితర విషయాలపై బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం తహసీల్దార్ ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో నూతన ఓట్ల నమోదుతో పాటు నకిలీ ఓట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ నాయకుల సూచనలు, సలహాలు కూడా పరిగణలోకి తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



అందూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. గుమ్మడిదల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపన చేసి, అన్నారంలో రూ.18లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. గుమ్మడిదల మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.125కోట్లను కేటాయించిందన్నారు. అన్ని గ్రామాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్‌లు నర్సింహ్మారెడ్డి, మురళి, నాయకులు హుస్సేన్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిన్నారం మండలం అందూర్‌లో రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ఖదీర్, నాయకులు వెంకటేశంగౌడ్, రాజేశ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా..

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణాలకు సహకరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మంగళవారం రూ.10లక్షల విరాళం అందించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికత కలిగి ఉండాలని కోరారు. నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న భిక్షపతి

కోహీర్(జహీరాబాద్): పంటలను చీడపీడల భారీ నుంచి రక్షించుకునేందుకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు భిక్షపతి తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాపూర్ రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జొన్న పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరానికి నాలుగు కిలోల చొప్పున మొక్క సూడులలో వేసుకోవాలన్నారు. శనగ పంటకు పూతదశకు ముందు, గింజ కట్టే దశలో ఒకసారి నీటితడులు ఇస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. రబ్బరు పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ రెండు మిల్లీలీటర్లు లీటర్ నీటికి లేదా డైఫ్లూబెంజురాన్ 1 మిల్లీలీటర్ లీటర్ నీటికి కలుపుకొని రెండు మూడు రోజుల వ్యవధిలో పంటపై పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఎండుతెగులు నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును ఒక లీటర్ నీటికి కలుపుకొని మొక్క మొదళ్లలో చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి పండరీ, మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, ఏఈఓ వేదవతి, రైతులు నర్సిములు, కిషన్ జయప్రకాష్, జానీమియా పాల్గొన్నారు.

పుల్‌కల్(అందోల్): వరిసాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని జోగిపేట ఏడీఏ అరుణ తెలిపారు. మంగళవారం మండలంలోని పుల్‌కల్, ముద్దాయిపేట గ్రామాల్లో పర్యటించి, పంటలను పరిశీలించారు. నారు మడిలో గుళికలు వేయని రైతులు వరి నాటు వేసిన పదిహేను రోజుల్లో కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. అవసరముంటే అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చైతన్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



రాంరెడ్డిబావి గ్రామంలో జెండావిష్కరణలో కాటా శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం అందుతుందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. 'హాథ్ సే హాథ్' జోడో యాత్రను గుమ్మడిదల మండలం రాంరెడ్డిబావి గ్రామం నుంచి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఆయన సతీమణి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధ ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, నాయకులు ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, నీలమ్మ, సంతోష, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన అవసరం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని కంభాలపల్లి గ్రామంలో మంగళవారం స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో టీబీ, హెచ్ఐవీపై ఆ సంస్థ లింక్ వర్కర్ దశరథ్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ, హెచ్ఐవీ వ్యాధి నివారణకు స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని అన్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ రక్షణ చర్యలు పాటిస్తే వ్యాధిని నిరోధించవచ్చని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, సర్పంచ్ పెద్దగొల్ల శ్రీహరి, ఉప సర్పంచ్ సుభాష్, పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

జోగిపేట(అందోల్): అన్నాసాగర్ సబ్‌స్టేషన్ వద్ద కరెంటు తీగలపై కోతులు దూకడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారస్తులు, వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. చుట్టు ప్రక్క గ్రామాల్లో సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు సిబ్బంది తెలిపారు. దీనిపై ఏడీ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా.. సబ్‌స్టేషన్ వద్ద కోతులు దూకడంతో వైర్లు ఒకదానిపై ఒకటి పడి సమస్య తలెత్తిందన్నారు. దగ్గరుండి మరమ్మతులను చేయించినట్లు తెలిపారు.

బడ్జెట్‌పై పీడీఎస్‌యూ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

జహీరాబాద్: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. మంగళవారం జహీరాబాద్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ నాయకులు ఎం.నరేష్, దినకర్, చంద్రకాంత్‌రెడ్డి, జగన్, సాగర్, సాయిల్‌రెడ్డి, ఉపేందర్, నిఖిల్, సాయి, విల్సన్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు చెల్లించి, పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల శుభ్రతకు కృషి చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలేదని, ప్రతీ నెలా అందించే రూ.8,500 వేతనం కూడా సమయానికి ఇవ్వడం లేదని ఆరోపించారు. అరకొర వేతనాలతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, వేతనాలు ప్రతీ నెలా అందించాలని కోరారు. ఒకే కార్మికుడికి అనేక రకల పనులు చెప్పడంతో అనారోగ్యం పాలవుతున్నారని, పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తయ్య, దశరథ్ సీఐటీయూ నాయకులు బాబురావు, జిల్లా కమిటీ సభ్యులు వెంకటయ్య, సంజీవ్, తిరుపతి చారి, రాములు, అశోక్, కిష్టయ్య, నాగయ్య, నిరంజన్, శేఖర్ పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 13వ బ్లాక్‌లో బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. బస్తీలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని మార్చాలని కోరారు. బోరు పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు పూర్తికాగానే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నాయకులు మల్లేష్, నరసింహారెడ్డి, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

బోరంచ పోచమ్మ ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

మనూరు(నారాయణఖేడ్): బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, జిల్లా ప్రణాళికం సంఘం మాజీ సభ్యుడు నగేశ్ శెట్కార్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామిలు ప్రత్యేక పూజలు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ యాత్ర కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ వైఫల్యాలను గడప గడపకు వెళ్లి వివరిస్తామని అన్నారు. నాగల్‌గిద్ద మండలం షాపూర్‌లో యాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిర్గాపూర్, ఖేడ్, మనూరు, నాగల్‌గిద్ద మండలాల అధ్యక్షులు మనీష్ పాటిల్, తాహెర్‌అలీ, సుభాష్‌రావు పాటిల్, మానిక్‌రావు పాటిల్, నెహ్రూనాయక్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ రూప్‌సింగ్, సంజీవ్‌పాటిల్, పరశురాం, రాజు, లక్ష్మణ్, వైజ్యనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం ర్యాకల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులు జలుబు, దగ్గు, చలిజ్వరంతో బాధపడుతుండగా స్పందించిన హెచ్ఎం చంద్రశేఖర్ విషయాన్ని ఇన్‌చార్జీ డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.రాజేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే తుర్కాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.అమిత్‌రాజ్‌తో మాట్లాడి పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పరీక్షలు, చికిత్సలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.

ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు అందిస్తున్న దృశ్యం

మునిపల్లి(అందోల్): మండలంలోని అంతారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయురాలు స్వప్న మంగళవారం ప్లేట్లను అందించారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం సాబేర్ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, చండీశ్వర్, గీతామాలిని, గంగమణి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను తగ్గించే వరకు పోరాటం

జిన్నారం(పటాన్‌చెరు): పెంచిన ఆస్తి పన్నులను తగ్గించే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు అన్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో పెంచిన ఆస్తి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధర్నా నిర్వహించారు. కౌన్సిలర్లు హన్మంత్ రెడ్డి, నిహారిక, గోపాలమ్మ, చంద్రయ్య తదితరులు ప్రజలతో కలిసి మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో ర్యాలీ చేపట్టి, మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. పెంచిన పన్నులను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మునీర్, శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్య, మోహన్, రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కౌన్సిలర్లు, ప్రజలు

సంక్షిప్త వార్తలు

◆ **పశు వైద్య శిబిరం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రుక్మాపూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు పశు వైద్యుడు అజింక్యా టీకాలు వేశారు. 4 నుంచి 8 నెలల ఆడ లేగ దూడల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలను వేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **ఎంపీపీ కార్యాలయం తనిఖీ**

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ ఎంపీపీ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, ఎంపీపీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, ఉపాధి హామీ పనుల వివరాలను ఎంపీడీఓ మధులతను అడిగి తెలుసుకున్నారు.

◆ **సంజీవన్‌రావుపేట్‌లో మహాపడిపూజ**

నారాయణఖేడ్: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో మంగళవారం మహాపడిపూజ నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి, ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జ్ పాండు, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ శివదీక్షాదారుల సౌకర్యార్థం శ్రీశైలం వెళ్లేందుకు సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను అద్దెకు అందిస్తామని తెలిపారు.

◆ **డీసీసీబీ సేవలపై కళాజాతా**

పుల్‌కల్(అందోల్): మండలంలోని రైతులకు డీసీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు పుల్‌కల్ డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రీలత తెలిపారు. మంగళవారం గ్రామంలో కళాజాతా నిర్వహించి, డీసీసీబీ సేవలను వివరించారు. ప్రదర్శనలో బ్యాంక్ అందిస్తున్న సేవలను పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

◆ **అడవులపై అవగాహన**

నారాయణఖేడ్: విద్యార్థులు అడవులపై అవగాహన కలిగి ఉండాలని అటవీశాఖ సబ్‌రేంజీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఖేడ్‌లోని గాయత్రీ పాఠశాల విద్యార్థులు మండలంలోని జూకల్ శివారు అటవీప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖేడ్, కల్హేర్, సిర్గాపూర్ సెక్షన్ అధికారులు స్వామి, ధన్‌సింగ్, రాములునాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నర్సరీని చూపించి, మొక్కల రకాలు, వాటితో పర్యావరణానికి కలిగే ప్రయోజనాలు, ఔషధ గుణాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, పీఈటీ అబ్దుల్ సాజిద్, ఉపాధ్యాయులు రవి, విజయ్‌పాల్, విజయకుమారి పాల్గొన్నారు.

◆ **నేడు జాతర ఉత్సవాలపై సమీక్ష**

కోహీర్(జహీరాబాద్): మండలంలోని పుణ్యక్షేత్రం బడంపేట శ్రీ రాచన్నస్వామి ఆలయ వార్షిక జాతర ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం మండల స్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివరుద్రప్ప తెలిపారు. కల్యాణ మంటపంలో మధ్యాహ్నం 12.30 గంటలకు సమావేశం ఉంటుందని, భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

◆ **పరామర్శ**

మనూరు(నారాయణఖేడ్): మండలంలోని దోసపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బిరాదర్ వీరన్న కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు భోజిరెడ్డి తదితరులు మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయనతో నాయకులు రాజు ఉన్నారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

మునిపల్లి(అందోల్): మండలంలోని గొర్రెగట్టు గ్రామంలో పెద్దగోపులారం బసవేశ్వర ఆలయ నిర్మాణానికి మాజీ ప్రజా ప్రతినిధులు రూ.50 వేల విరాళం అందజేశారు. పెద్దగోపులారం ఎంపీటీసీ పాండు రూ.25వేలు, బుదేరా మాజీ ఎంపీటీసీ మనోహర్ యాదవ్ రూ.25 వేలను మంగళవారం ఆలయ బాధ్యులకు అందించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ **9న జాబ్ మేళా**

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రాధిక తెలిపారు. ఉదయం 11 నుంచి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పాత వెలుగు ఆఫీస్‌లో మేళా ఉంటుందన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, హోమ్ కేర్, నర్సింగ్ అసిస్టెంట్ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండి, పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైనవారు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 08455 271010 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

◆ **జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక**

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లా క్రికెట్ జట్ల ఎంపికను నిర్వహిస్తున్నట్లు జిల్లా 9ఎ సైడ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి తుకారం, కార్యదర్శి జైపాల్ తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు టీపీస్పీ క్రికెట్ అకాడమీకి ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోతో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, పూర్తి వివరాలకు 8978547442, 8790463842, 9700753335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



అపూర్వ సమ్మేళనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్ 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

బీఎస్పీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బహుజనులకు ప్రయోజనకరంగా లేదని బీఎస్పీ జిల్లా నాయకుడు ముప్పారం ప్రకాశం అన్నారు. మంగళవారం అందోలు మండలం డాకూరు గ్రామంలో బీఎస్పీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు పిప్పడ్‌పల్లి మోహన్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రజల బతుకులు మార్చడానికి ఉన్నతమైన ఉద్యోగాన్ని వదిలేసి బీఎస్పీ పార్టీకి సారథ్యం వహిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. నాయకులు మల్లేశం, సంజీవయ్య, మహేష్, బాలరాజు, రమేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.